



ఎల్లారెడ్డిపేటలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

రైతులు అధైర్యపడొద్దు

● అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

తొగుట, మే 28 (ఆంధ్రజ్యోతి): రైతులు అధైర్యపడొద్దని, చివరిగింజ వరకు కొనుగోలు చేస్తామని అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ తెలిపారు. బుధవారం తొగుట మండలం ఎల్లారెడ్డిపేటలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆమె సందర్శించి రైతులతో మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించిన రెండు మూడు రోజుల్లోనే వారి ఖాతాల్లో జమ చేస్తామని చెప్పారు. వర్షాలు పడుతున్నందున కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యం తడవకుండా కుప్పలపై టార్పాలిన్ కవర్లు కప్పుకోవాలని సూచించారు. ఇంకా ఎక్కడైనా వరికోతలు కాకుంటే త్వరగా పూర్తిచేసి కేంద్రాలకు తీసుకురావాలని చెప్పారు. ఆమె వెంట డీపీఎం కరుణాకర్, తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఏవో మోహన్, ఏపీఎం శ్రీనివాస్, ఏపీవో నర్సింహారెడ్డి, ఏఈవో నాగార్జున, ఐకేపీ సిబ్బంది, రైతులు ఉన్నారు.

నేటి నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ మూల్యాంకనం

సిద్దిపేట కల్చరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): నేటి నుంచి ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ మొదటి విడత మూల్యాంకనం సిద్దిపేట ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ప్రారంభమవుతుందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి, క్యాంప్ ఆఫీసర్ కె. రవీందర్ రెడ్డి తెలిపారు. తొలివిడతలో తెలుగు, ఆంగ్లం, గణితం, పౌరశాస్త్రం సబ్జెక్ట్‌ల మూల్యాంకనం మొదలవుతుందన్నారు. సిద్దిపేట, మెదక్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ, ప్రైవేట్ కళాశాలలకు సంబంధించిన జూనియర్ లెక్చరర్లు గురువారం ఉదయం 10 గంటలకు రిపోర్ట్ చేయాలని చెప్పారు.

ఉమ్మడి జిల్లాలో భూభారతి పైలెట్ మండలాల్లో వచ్చిన దరఖాస్తులు దాదాపుగా ఏడు వేలు. అయితే, వీటిని పరిష్కరించడమే ఇప్పుడు అధికారులకు పెద్ద సవాల్‌గా మారింది. జూన్ 2వ తేదీ వరకు పరిష్కరించాలనే ఆదేశాలు ఉన్నప్పటికీ నెలల కొద్దీ సమయం పడుతుందని అధికారులే చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో మూడు మండలాలకే ఈ పరిస్థితి ఉంటే మిగతా 72 మండలాల్లో సదస్సులు చేపట్టి దరఖాస్తులు స్వీకరించి వాటిని పరిష్కరించాలంటే ఇంకెంత సమయం పడుతోందోననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



అక్కన్నపేట మండలంలో దరఖాస్తుల స్వీకరణ

మూడు మండలాలు..
ఏడు వేల సమస్యలు

‘భూభారతి’ పైలెట్ మండలాల్లో దరఖాస్తుల వెల్లువ

- ఇందులో 25 శాతం సాదాబైనామావే
- పెద్ద సంఖ్యలో మిస్సింగ్ సర్వే నంబర్లు
- అసైన్డ్ భూముల వివాదాలూ ఎక్కువే
- అధికారులకు సవాల్‌గా మారిన పరిష్కారాలు
- జూన్ 2 తర్వాత అన్ని మండలాల్లో సదస్సులు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మే 28 : భూభారతిని అమలు చేయాలంటే ఆటంకంగా ఉన్న భూసమస్యలను పరిష్కరించడంపై రెవెన్యూ అధికారులు దృష్టి సారించారు. ముందుగా జిల్లాకు ఒక మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఆ మండలంలోని అన్ని గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు నిర్వహించి దరఖాస్తులను స్వీకరించారు. సిద్దిపేట జిల్లాలో పైలెట్ మండలమైన అక్కన్నపేటలో 4,183, సంగారెడ్డి జిల్లాలోని

మిగతా 6వ పేజీలో



సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో స్వీకరిస్తున్న దరఖాస్తులు

సంగారెడ్డి జిల్లాలో

కొండాపూర్ మండలం	
మొత్తం దరఖాస్తులు	1718
సాదాబైనామా	132
మిస్సింగ్ సర్వే నంబర్లు	566
డీఎస్ పెండింగ్	104
విస్తీర్ణం వివాదాలు	197
పీవోటీ భూములు	148
పెండింగ్ మ్యూటేషన్	94
కోర్టు కేసులు	609

సిద్దిపేట, మెదక్ జిల్లాలో

అక్కన్నపేట మండలం	
మొత్తం దరఖాస్తులు	4,183
సాదాబైనామా	1630
అసైన్డ్ భూములు	413
పీవోటీ	691
అప్పీల్	296
శివాయి జమేదార్	246
మిస్సింగ్ సర్వే నంబర్లు	219
విరాసత్	214
విస్తీర్ణం వివాదాలు	153

చిలప్‌చెడ్ మండలం	
మొత్తం దరఖాస్తులు	1045
సాదాబైనామా	255
పీవోటీ	90
మిస్సింగ్ సర్వే నంబర్లు	418
విరాసత్	88
విస్తీర్ణం వివాదాలు	193

రూ.1.47 కోట్లతో ఆలయాలకు మహర్దశ

● సాంకేతిక మంజూరు పూర్తి



దుబ్బాక కాశీవిశ్వనాథ స్వామి ఆలయం

దుబ్బాక, మే28 (ఆంధ్రజ్యోతి): వందల ఏళ్ల క్రితం నిర్మాణం జరిగి...వైభవంగా వెలుగొంది.. జీర్ణావస్థకు చేరకున్న దుబ్బాక మున్సిపల్ పరిధిలోని మూడు పురాతన ఆలయాల పునరుద్ధరణకు ప్రభుత్వం నడుంబిగించింది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండాసురేఖ ఆదేశాల మేరకు దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతిపాదనలు పంపారు. అందులో దుబ్బాక కాశీ విశ్వేశ్వరాయ పునఃనిర్మాణానికి రూ.50 లక్షలు, లచ్చపేట రాజరాజేశ్వరాలయ అభివృద్ధికి రూ.50 లక్షలు, ధర్మాజీపేట సీతారామచంద్ర ఆలయ అభివృద్ధికి రూ.47 లక్షలకు ప్రతిపాదనలు పంపగా ప్రభుత్వం సాంకేతిక మంజూరు విడుదల చేసింది. ఈ సందర్భంగా మంత్రి కొండాసురేఖ, చెరుకుశ్రీనివాస్‌రెడ్డి, స్వామిసమర్థమహారాజ్‌కు పార్టీ నాయకులు ఉప్పునూతుల ప్రవీణ్‌గౌడ్, శ్రీరాంనరేందర్‌లు వేరువేరు ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

గంజాయి రహిత జిల్లాగా మారుద్దాం : సీపీ



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అనురాధ

సిద్దిపేట క్రైం, మే 28 (ఆంధ్రజ్యోతి): గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తుపదార్థాలపై మరింత దృష్టిసారించి గంజాయి రహిత జిల్లాగా మారుద్దామని సీపీ అనురాధ సూచించారు. బుధవారం ఆమె సిద్దిపేట పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పెండింగ్ కేసులపై ఏసీపీ, సీఐలతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రోయాక్టివ్ పోలీసింగ్‌పై దృష్టిసారించి నేరాలను తగ్గించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత డిపార్ట్‌మెంట్‌శాఖ అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. పోలీసు అధికారులు, సిబ్బంది తప్పకుండా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ల వైర్ల నిందితులను పట్టుకోవాలని, ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలని ఆమె స్పష్టం చేశారు. సమావేశంలో ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, ఏసీపీలు రవీందర్ రెడ్డి, నరసయ్య, సదానందం, సుమన్‌కుమార్, రవీందర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి చెక్కు అందజేత

గతేడాది డిసెంబర్‌లో రోడ్డుప్రమాదంలో మరణించిన వెంకటేష్ కుటుంబసభ్యులకు ఎస్‌బీఐ సాలరీ ప్యాకేజీ కింద రూ.కోటి ఇన్సూరెన్స్ చెక్కును బుధవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సీపీ అనురాధ, ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ మారుతీ అందజేశారు.



తొగుటలో దంతె పడుతున్న రైతు

ఎరువాక జోరు

నైరుతి రుతుపవనాల ప్రభావం కారణంగా అనుకున్న దానికంటే ముందస్తుగా వర్షాలు పడుతాయని వాతావరణశాఖ తెలపడంతో సిద్దిపేట జిల్లాలో సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఈ మేరకు రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. అయితే, అధికారుల సూచనల మేరకు కొంతమంది రైతులు 48 గంటల పాటు వర్షాలు కురిసిన తరువాత తమ భూములను దున్ని విత్తనాలు చల్లాలని భావిస్తున్నారు.

- సిద్దిపేట ఆంధ్రజ్యోతి, మే 28



పొలంలో పెరిగిన గడ్డి, చెత్తను తగలబెడుతున్న రైతులు

పత్తి విత్తనాలు విత్తుతున్న రైతులు



పొలంలో కంపోస్టు ఎరువును చల్లుతున్న కూలీలు

ఎంఎస్పీ..ప్చ్..!



- జిల్లాలో 5.40 లక్షల ఎకరాల్లో సాగు
- అంతకు ఎక్కువగా పెరగనున్న పెట్టుబడులు

గజ్వేల్, మే 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఆయా పంటలకు కనీస మద్దతు ధర (మినిమం సపోర్టు ప్రైజ్(ఎంఎస్పీ))ను ప్రకటిస్తూ జారీ చేసిన ఉత్తర్వులపై రైతులు, రైతు సంఘాలు పెదవి విరుస్తున్నాయి. యేటా వానాకాలం సాగుకు ముందు పంటలకు మద్దతు ధరను ప్రకటిస్తున్నది. ఈ సారి వరికి రూ.69, పత్తికి రూ.589 పెంచుతున్నట్లు ప్రకటించింది. యేటా రైతాంగానికి పెట్టుబడి భారం రూ.వేలల్లో పెరుగుతుంటే.. కనీస మద్దతు ధర మాత్రం పదుల్లోనే పెరుగుతుంది. పెరుగుతున్న ఎరువులు, విత్తనాలు, పురుగుమందులకు అనుగుణంగా కనీస మద్దతును కేంద్ర ప్రభుత్వం పెంచడం లేదు. పెట్టుబడికి.. రాబడికి మధ్య వ్యత్యాసం పెరిగి రైతులు అప్పుల పాలవుతున్నారు. పత్తికి కనీస మద్దతు ధర రూ.10వేలు ఉంటేనే గిట్టుబాటు అవుతుందని సగటు పత్తి రైతు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం పత్తికి రూ.589 మాత్రమే పెంచి చేతులు దులుపుకుంది. పత్తి విత్తన ప్యాకెట్ ధరను ప్రతి సంవత్సరం రూ.40 వరకు పెంచుతున్న కేంద్రం మద్దతు ధరను మాత్రం నామమాత్రంగానే పెంచుతుందని రైతులు వాపోతున్నారు.

80 శాతం వరి, పత్తి

జిల్లావ్యాప్తంగా 5.40 లక్షల ఎకరాల్లో ఆయా రకాల పంటలను రైతులు సాగు చేస్తున్నారు. జిల్లాలో ప్రధాన పంట వరి కాగా, రెండవ పంటగా పత్తి ఉంది. ఈ రెండు పంటల పైనే రైతులు దాదాపుగా 80శాతం మేర ఆధారపడి సాగుచేస్తున్నారు. జిల్లాలో కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా సాగునీటి రిజర్వాయర్లు అందుబాటులోకి రావడంతో వరి వైపు రైతులు మళ్లారు. సాగు నీటి జలాశయాలు అందుబాటులోకి రాకముందు పత్తి, వరి దాదాపుగా సమంగా ఉండగా, ప్రస్తుతం వరి ప్రధాన పంటగా సాగవుతుంది. 5.40 లక్షల ఎకరాల్లో 3.40 ఎకరాల్లో వానకాలం వరి సాగు చేస్తుండగా, పత్తి లక్ష ఎకరాల్లో సాగవుతుంది. ఇతర మొక్కజొన్న, కందులు, సోయా పంటలు మరో లక్ష ఎకరాల్లో సాగవుతున్నాయి. పెరిగిన మద్దతు ధరతో వచ్చే దిగుబడిని పోలిస్తే రైతుకు వరిపై రూ.68 కోట్లు, పత్తిపై రూ.58 కోట్ల మేర లబ్ధి చేకూరనుంది. పెట్టుబడి ప్రతి ఏడాది ఎకరాకు కనీసం మరో రూ. 2వేల వర కు పెరిగే అవకాశముంది. పెట్టుబడితో పోలిస్తే రాబడి తక్కువగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

పత్తికి పెట్టుబడులే ఎక్కువ

పత్తికి కనీస మద్దతు ధర రూ.10 వేలు చేస్తేనే పెరిగిన పెట్టుబడికి, వచ్చే దిగుబడికి మధ్య వ్యత్యాసం తగ్గి రైతుకు గిట్టుబాటు అవుతుంది. రైతులకు పత్తికి ఎకరాకు ఐదు ప్యాకెట్ల విత్తనాలకు రూ. 5 వేలు దున్నకానికి రూ.10వేలు, విత్తడానికి రూ.2 వేలు, డీఏపీ, ఇతర ఎరువులకు ఎకరాకు రూ.6వేలు, పై మందులకు రూ.5 వేలు, కలుపు తీయడానికి రూ.4వేలు, పత్తి తీయడానికి రూ.4 వేలు ఇలా రూ.35 వేల నుంచి రూ.40వేల వరకు పెట్టుబడి అవుతుండగా, కేవలం 5 నుంచి ఏడు క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుంది. మార్కెట్‌లో కనీస మద్దతు ధరకు విక్రయించినా రైతులకు పెట్టిన పెట్టుబడి మాత్రమే వస్తుంది. దీంతో రైతు చేసిన కష్టానికి ప్రతిఫలం లేకుండా పోతుంది. కనీస మద్దతు ధర రూ. 10 వేలు చేస్తేనే రైతులకు ఎంతో కొంత ఊరట లభించే అవకాశముంది.

పండ్ల తోటలకు ఉపాధిహామీ!

- వంద శాతం సబ్సిడీతో సాగుకు అవకాశం
- పశువుల షెడ్లు, నీటితొట్ల నిర్మాణం
- ఆసక్తి చూపుతున్న రైతులు

దౌల్తాబాద్, మే 28 (ఆంధ్రజ్యోతి) : వంద శాతం సబ్సిడీతో పండ్ల తోటలకు ఉపాధి హామీ పథకం చేయూతగా నిలుస్తోంది. దీంతో దౌల్తాబాద్ మండల కేంద్రంతో పాటు ఇతర గ్రామాల్లో అనేక మంది రైతులు పండ్ల తోటల పెంపకంపై దృష్టి సారిస్తున్నారు. చిన్న, సన్నకారు రైతులు 5 ఎకరాల లోపు భూమి, ఉపాధిహామీ కార్డు కలిగి ఉంటే పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోవచ్చు. కొబ్బరి, నారింజ, బత్తాయి, దానిమ్మ, జామ, సపోట, ఆపిల్‌బేర్, డ్రాగన్ ఫ్రూట్ వంటి ఇతర రకాల

మిగతా 8వ పేజీలో



ఇందుప్రియల్‌లో సాగు చేస్తున్న సీతాఫలం, బొప్పాయి తోటలు

‘గోల్‌మాల్’ డబ్బు వాపస్‌కు ఓకే

● 21,835 కిలోల ధాన్యం డబ్బు చెల్లించేందుకు అంగీకారం

7

వేర్వేరు ఘటనల్లో నలుగురి బలవన్మరణం

6



భరతనాట్యం చేస్తున్న యువతి

హోజాగిరి హొయలు

ఐఐటీహెచ్‌లో మూడో రోజూ సాంస్కృతిక హంగామా

అలరించిన సంప్రదాయ కళా ప్రదర్శనలు

‘నా సొంత రాష్ట్రమైన త్రిపురలోని హోజాగిరి జానపద నృత్య కళా ప్రదర్శనను స్పిక్ మైకే అంతర్జాతీయ వేడుకలో ఏర్పాటు చేయడం, ఇది పదవీకాలంలో నాకు వ్యక్తిగత గర్వకారణంగా నిలుస్తుంది’ అని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ రెండు రోజుల క్రితం ఐఐటీహెచ్‌లో కళా వేడుకను ప్రారంభిస్తున్నప్పుడు అన్న మాటలివి. ఐఐటీహెచ్‌లో కొనసాగుతున్న అంతర్జాతీయ కళా వేడుకలో మూడోరోజైన బుధవారం ఇక్కడి ఆడిటోరియంలో ఈ హోజాగిరి నృత్యాన్ని ప్రదర్శించారు. కిక్కిరిసిన ఆడిటోరియంలో త్రిపుర రయాంగ్, మర్మ తెగల వారు హోజాగిరి జానపద కళావైభవాన్ని చాటారు.

7లో



త్రిపుర నాగరికతను తెలిపే హోజాగిరి నృత్యం చేస్తున్న కళాకారిణి



పశ్చిమబెంగాల్ తారాపద రజక్ పురూలియా చౌ నాటక ప్రదర్శన

ద్విచక్ర వాహనం అదుపు తప్పి వ్యక్తి మృతి

చిన్నశంకరంపేట, మే 28 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం అదుపుతప్పిన ఘటనలో ఓ వ్యక్తి తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని మిర్జాపల్లి తండాలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్‌ఐ నారాయణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన కాత్రోత్ రాజు(45)మిర్జాపల్లి రైల్వేస్టేషన్ కాలనీలో నివాసముంటున్నాడు. సాయంత్రం స్వగ్రామమైన మిర్జాపల్లి తండాకు ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. రైల్వే అండర్ బ్రిడ్జి వద్దకు రాగానే కుక్క అడ్డు రావడంతో దాన్ని తప్పించబోయి వాహనం అదుపు తప్పింది. ఈ క్రమంలో రైల్వే హైట్ గేజ్‌ను ఢీకొని తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య చాంది, ఒక కూతురు, ఒక కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వేర్వేరు ఘటనల్లో నలుగురి బలవన్మరణం

ఉమ్మడి మెదక్ జిల్లాలో బుధవారం చోటు చేసుకున్న వేర్వేరు ఘటనల్లో నలుగురు బలవన్మరణం చెందారు. మృతుల్లో ఇద్దరు మద్యం, జల్సాలకు అలవాటుపడి ఉరేసుకోగా, పలు చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్న యువకుడు మనోవేదనతో చెరువులో దూకాడు. మరోవ్యక్తి అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందుల కారణంగా పురుగులమందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో ఉమ్మడి జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో విషాదం నెలకొన్నది.

- చేర్యాల/గజ్వేల్‌రూరల్/హవేళిఘణపూర్, మే 28 (ఆంధ్రజ్యోతి)

కొమురవెల్లిలో మద్యానికి బానిసైన వ్యక్తి..

కొమురవెల్లి మండలకేంద్రంలో మద్యానికి బానిసైన వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. కొమురవెల్లికి చెందిన కొయ్యడ వెంకటేశ్(45)కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు.రోజూ డబ్బుల కోసం భార్యను వేధిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి భార్యతో గొడవపడి ఇంట్లో గదిలోకి వెళ్లి గడియపెట్టుకున్నాడు. దీంతో భార్య పద్మ ఇంటి ఆవరణలోనే మరోచోట నిద్రించినట్లు పేర్కొంది. బుధవారం ఉదయం గది తలుపులు తీయకపోవడంతో భార్యకు అనుమానం కలిగి చుట్టుపక్కలవారి సాయంతో తలుపులు ధ్వంసం చేసి ఇంట్లో పరిశీలించగా ఉరేసుకుని వేలాడుతున్న వెంకటేష్ మృతదేహం కనిపించింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్‌ఐ రాజు తెలిపారు.

కేసులకు భయపడి..

గజ్వేల్ మండలపరిధిలోని సింగాటంలో ఓ యువకుడు చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అందోల్ నర్సయ్య అంజమ్మ దంపతుల కుమారుడు కృష్ణ(26) కొన్ని రోజులుగా తూప్రాన్ పరిధిలోని ఓ విత్తన పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఈ నెల 26న సింగాటం గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో కలిసి ఆటోలో బయలుదేరిన కృష్ణ మార్గమధ్యంలో పిడిచెడ్‌లో దిగాడని సదరు వ్యక్తి చెప్పినట్టు కుటుంబీకులు తెలిపారు. ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం గ్రామంలోని లింగచెరువులో ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారమందించారు. గ్రామస్థుల సాయంతో పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి కృష్ణ మృతదేహమని నిర్ధారించారు. చెరువుకట్ట వద్ద బూట్లు, బ్యాగ్‌తో పాటు సెల్‌ఫోన్ లభ్యమయ్యాయి. కృష్ణ మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడు కృష్ణ పలు చోరీ కేసుల్లో నిందితుడిగా ఉండడంతో కేసులకు భయపడి, మనోవేదనతో చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

హవేళిఘణపూర్ మండలంలో ఇద్దరు..

హవేళిఘణపూర్ మండలంలో జరిగిన వేర్వేరు ఘటనల్లో ఓ యువకుడు జల్సాలకు అలవాటు పడి ఉరేసుకోగా. మరో వ్యక్తి ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యంతో పురుగులమందు తాగాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తొగిట గ్రామానికి చెందిన ఎలబోయిన సురేష్(22) ఏ పని చేయకుండా జులాయిగా తిరుగుతూ జల్సాలకు అలవాటుపడ్డాడు. తన ఖర్చులకు డబ్బులు ఇవ్వాలంటూ తల్లి సత్యమ్మను అడుగగా నిరాకరించింది. దీంతో మనస్థాపం చెందిన సురేష్ బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు మృతదేహాన్ని మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరో ఘటనలో.. మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన నార్ల బాలయ్య(45) వ్యవసాయం చేసుకుంటూ జీవించేవాడు. కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులతో తీవ్రంగా బాధపడుతూ ఈ నెల 25న పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. కుటుంబీకులు బాలయ్యను మెదక్ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఆయా ఘటనలకు సంబంధించి మృతుల కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు.



సింగాటంలో మృతి చెందిన కృష్ణ(ఫైల్), వెంకటేశ్ మృతదేహం

దామరకుంట భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడి ప్రదర్శన..

మరోసారి రాష్ట్రస్థాయికి ..



జిల్లా విద్యాధికారితోదామరకుంట ఉపాధ్యాయుడు చిన్న బ్రహ్మయ్య

మర్కుక్, మే 28 (ఆంధ్రజ్యోతి): పాఠశాల అభివృద్ధిలో వివిధ అభ్యసన పద్ధతులు(బెస్ట్ ప్రాక్టీస్)లలో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన ఉపాధ్యాయుల విభాగంలో జడ్పీ ఉన్నతపాఠశాల దామరకుంట భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు చిన్నబ్రహ్మయ్య ఎంపికయ్యారని మండల విద్యాధికారి వెంకటరాములు బుధవారం తెలిపారు. జిల్లా స్థాయిలో 78 మంది ఉపాధ్యాయులు ఈ ప్రదర్శనలో పాల్గొనగా రాష్ట్రస్థాయికి జిల్లా నుంచి ముగ్గురిని ఎంపిక చేశారని వారిలో చిన్న బ్రహ్మయ్య ప్రథమ స్థానంలో నిలిచారని ఎంఈవో పేర్కొన్నారు. చిన్నబ్రహ్మయ్య ఉత్తమ ప్రదర్శనలో భాగంగా ఏ టు జెడ్ సైన్స్ కాన్సెప్ట్ గురు, స్టేట్ మ్యాజిక్, పటాల ద్వారా సైన్స్ అభివృద్ధి అనే పద్ధతుల ద్వారా విద్యార్థులకు సులభతరమైన బోధన చేయడంతో పాటు విద్యార్థుల పెంపుదలకు తోడ్పాటును అందించినందుకుగాను రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్టు తెలిపారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు చిన్న బ్రహ్మయ్యను పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు బాల్‌రెడ్డి, పీఆర్టీయూ మర్కుక్ మండల అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్‌రావు, కుమార్ అభినందించారు.

తెల్లాపూర్‌లో నాలుగు బోరుబావులు సీజ్

రామచంద్రాపురం, మే 28 (ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం మండల పరిధి తెల్లాపూర్‌లో అక్రమంగా వేసిన బోరుబావులను సీజ్ చేసినట్టు తహసీల్దార్ సంగ్రాంరెడ్డి బుధవారం తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎలాంటి అనుమతులు లేకుండా నీటి దందా చేస్తున్న బోరుబావుల జాబితా ప్రకారం భూగర్భ, మున్సిపల్ శాఖ, పోలీసుశాఖలకు చెందిన అధికారులు ఈ దాడులు నిర్వహించారు. ఈ మేరకు తెల్లాపూర్‌లోని సర్వే నంబర్లు 396, 504లలో ఏర్పాటు చేసిన 4 బోరు బావులను పూర్తిగా మట్టితో పూడ్చివేసి సీజ్ చేశారు. బోరుబావులు ఏర్పాటు చేసుకునేవారు విధిగా ప్రభుత్వ అనుమతి తీసుకోవాలని తహసీల్దార్ సూచించారు.

మూడు మండలాలు.. ఏడు వేల సమస్యలు

(5వ పేజీ తరువాయి)

కొండాపూర్ మండలంలో 1,718, మెదక్ జిల్లాలోని చిలప్‌చెడ్ మండలంలో 1,045 దరఖాస్తులు వచ్చాయి. వీటిని పరిష్కరించడానికి ఎన్నాళ్లు పడుతుందో చూడాలి.

సాదాబైనామా దరఖాస్తులే 2వేలు

గత ప్రభుత్వ హయాంలో సాదాబైనామా ద్వారా భూములను క్రమబద్ధీకరించాలని నిర్ణయించారు. దరఖాస్తులు సైతం స్వీకరించారు. అయితే, ఆ దరఖాస్తులు ఏళ్ల తరబడిగా పెండింగ్‌లోనే ఉన్నాయి. ప్రస్తుత ప్రభుత్వం సాదాబైనామాలను పరిష్కరించడానికి చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన అక్కన్నపేట మండలంలో 1,630 సాదాబైనామా దరఖాస్తులు వచ్చాయి. అదే విధంగా కొండాపూర్ మండలంలో 132 దరఖాస్తులు, చిలప్‌చెడ్ మండలంలో 253 దరఖాస్తులు స్వీకరించారు. ఉమ్మడి జిల్లాలో వచ్చిన 7 వేల దరఖాస్తుల్లో 2 వేల దరఖాస్తులు సాదాబైనామావే ఉండడం గమనార్హం. వీటి పరిష్కారంలో అనేక వివాదాలు తలెత్తుతాయనే గత ప్రభుత్వం జాప్యం చేసింది. మరి ప్రస్తుతం ఇతర దరఖాస్తులతో పోల్చితే సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారమే కత్తిమీద సాములా మారనున్నది.

పరిశీలనలో నిమగ్నం

గ్రామాల్లో స్వీకరించిన అన్ని రకాల దరఖాస్తులను ప్రస్తుతం అధికారులు పరిశీలిస్తున్నారు. ఈనెల 20వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతులు సమర్పించిన ప్రతీ దరఖాస్తును తీసుకున్నారు. దరఖాస్తుల్లో సమస్యల వారీగా విభజించారు. ఏయే సమస్యకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయో లెక్కగట్టారు. ఇంచుమించు అన్ని గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి ఉంటుందని అంచనా వేశారు. అప్పటికప్పుడు కొన్ని దరఖాస్తులను పరిష్కరించారు. కోర్టు కేసుల్లో ఉన్న వాటిని రెండో దశలో పరిష్కరించడానికి పక్కన బెట్టారు. డీఎస్ పెండింగ్, పీవోబీ, పీవోటీ, మ్యూటేషన్, సర్వే నంబర్ మిస్సింగ్, పాస్‌బుక్‌లో పొరపాట్లను ముందుగా పరిష్కరిస్తే బాధితుల సంఖ్య తగ్గుతుందని భావించి ఆ దిశగా కసరత్తు చేస్తున్నారు.

జూన్ 2 నుంచి అన్నిగ్రామాల్లో..

ఇప్పటివరకు జిల్లాలో ఒక మండలాన్ని మాత్రమే పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. జూన్ 2వ తేదీ నుంచి అన్ని మండలాల్లోనూ రెవెన్యూ సదస్సులు నిర్వహించడానికి చర్యలు చేపట్టారు. అప్పటి వరకు పైలెట్ ప్రాజెక్టు గ్రామాల్లో స్వీకరించిన దరఖాస్తుల పరిష్కారంలో తలెత్తే ఇబ్బందులను పరిశీలిస్తున్నారు. వీటిని అధిగమిస్తేనే ఇతర గ్రామాల్లో పరిష్కారాల గురించి ఒక నిర్ణయానికి రావొచ్చని అనుకుంటున్నారు. ఇక రాబోయే నెలరోజుల్లో రెవెన్యూ యంత్రాంగమంతా గ్రామాల్లోనే ఉండబోతుంది.



పశ్చిమ బెంగాల్‌లోని ప్రాచీన తారాపద రజక్ పురూలియా చౌ నాటక ప్రదర్శన



త్రిపుర రాష్ట్రంలోని నాగరికతను తెలిపే హోజాగిరి నృత్యం చేస్తున్న కళాకారులు



ఆర్ట్స్ గ్యాలరీలోని చిత్రాలను పరిశీలిస్తున్న విద్యార్థినులు



హోజాగిరి హొయలు

ఐఐటీహెచ్‌లో మూడో రోజూ సాంస్కృతిక హంగామా

అలరించిన సంప్రదాయ కళా ప్రదర్శనలు

కొనసాగుతున్న స్పిక్ మైకే అంతర్జాతీయ వేడుక

కంది, మే 28 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీహెచ్‌లో స్పిక్ మైకే 10వ అంతర్జాతీయ సదస్సు మూడో రోజు బుధవారం కూడా ఉల్లాసభరితంగా కొనసాగింది. సాంస్కృతిక కార్యక్రమాలను ప్రత్యక్షంగా వీక్షించడానికి దేశ నలుమూలల నుంచి వచ్చిన కవులు, రచయితలు, సంగీత అభిమానులు, శాస్త్రీయ నృత్య కళాకారులు, సాహితీవేత్తలు, ఆయా పాఠశాలల విద్యార్థులతో ఐఐటీహెచ్ ప్రాంగణం జనసంద్రమైంది. ఆర్ట్స్ గ్యాలరీలో మహా కుంభమేళా చిత్రాలను ప్రదర్శించారు. తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి హఠ, నాద్ యోగా, ధ్యానం, భరతనాట్యం, సంగీత కచేరీలు జరిగాయి. దేబాసిస్ రియాంగ్ హోజాగిరి నృత్యం, తారాపద రజక్ పురూలియా చౌ, ప్రహ్లాద్ సింగ్ టిపానియా కబీర్ గయాన్, పండిట్ హరిప్రసాద్ చౌరాసియా (పద్మ విభూషణ్ అవార్డు గ్రహీత) వేణువు, అభిషేక్ రఘురామ్ కర్నాటిక్ వోకల్, విద్వాన్ యెల్లా వెంకటేశ్వరరావు మృదంగం అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈ సదస్సుకు స్పిక్ మైకే జాతీయ చైర్‌పర్సన్ ఆర్.ఎం. తివారీ, ఐఐటీ హైదరాబాద్ అధ్యాపకులు, బ్రహ్మ కుమారీస్ సభ్యులు తదితరులు హాజరయ్యారు.

ప్రత్యేక ఆకర్షణగా హోజాగిరి నృత్య ప్రదర్శన

ఈశాన్య భారతదేశంలోని త్రిపుర రాష్ట్రంలో ప్రదర్శించే అనేక రకాల జానపద నృత్యాలలో హోజాగిరి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రయాంగ్, మర్మ తెగలకు చెందినవారు ఈ నృత్యం చేసేటప్పుడు కళాకారులంతా సంప్రదాయ సంగీత వాయిద్యాలు మోగిస్తూ జానపద గీతాలు పాడారు. అమ్మాయిలు తమ తలలపై గాజు సీసాలను ఉంచి దానిపై వెలగుతున్న దీపం పెట్టుకుని, కుండల మీద నిలబడి నృత్యం చేశారు. త్రిపురి (అతిపెద్ద ప్రాంతీయ జాతి సమూహం) మోగ్ ప్రజలు వార్షిక ప్రాంతీయ వేడుకలైన విత్తనాలు, పంటకోత పండుగల సమయంలో ప్రదర్శిస్తారని హోజాగిరి నృత్య బృంద సమన్వకర్త దేబాసిస్ రియాంగ్ తెలిపారు.



హిందుస్తానీ సంగీత కచేరీ



చౌటకూర్‌లో ధాన్యం బస్తాలను పరిశీలిస్తున్న డీసీఎంఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి బిజినెస్ మేనేజర్ అంజనేయులు

మొత్తం ధాన్యం కొంటాం

- రైతులు ఆందోళన చెందవద్దు
- లారీల కొరతతో ధాన్యం తరలింపునకు ఆటంకాలు
- ఇప్పటివరకు 1,77,360 క్వింటాళ్లు కొనుగోలు చేశాం
- డీసీఎంఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి బిజినెస్ మేనేజర్ ఆంజనేయులు

పుల్‌కల్, మే 28 (ఆంధ్రజ్యోతి): ధాన్యం మొత్తాన్ని కొంటామని, రైతులెవరూ ఆందోళనకు గురికావొద్దని డీసీఎంఎస్ ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి బిజినెస్ మేనేజర్ అంజనేయులు తెలిపారు. మండల కేంద్రమైన చౌటకూర్‌లో బుధవారం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లాలో డీసీఎంఎస్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన 31 కేంద్రాల్లో ఇప్పటివరకు 3081 మంది రైతుల నుంచి 1,77,360 క్వింటాళ్ల వరి ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. తడిసిన ధాన్యాన్ని కూడా కొంటున్నామన్నారు. సరిపడా టార్పాలిన్లు అందుబాటులో ఉంచామన్నారు. ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి నిర్లక్ష్యం లేదని తెలిపారు. కాంటా చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు రవాణా చేసేందుకు లారీల కొరత తీవ్రంగా ఉందని, ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. చౌటకూర్ కేంద్రంలో మరో నాలుగు లారీలకు సరిపోను ధాన్యం బస్తాలు ఉన్నాయని తెలిపారు. రెండు, మూడు రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేస్తామన్నారు. ఆయన వెంట కొనుగోలు కేంద్రాల పర్యవేక్షకులు వంశీ, సిబ్బంది కిరణ్, అశోక్, రైతులు పల్నాటి మల్లికార్జున్‌గౌడ్, బుచ్చాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'గోల్‌మాల్' డబ్బుల వాపస్‌కు ఓకే

- 21,835 కిలోల ధాన్యం డబ్బులు చెల్లించేందుకు అంగీకారం

చేర్యాల, మే 28 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మండలం మర్రిముస్త్యాల గ్రామంలోని కొనుగోలుకేంద్రంలో ధాన్యం తూకంలో మోసానికి పాల్పడి గోల్‌మాల్ చేసిన డబ్బులను తిరిగి రైతులకు చెల్లించేందుకు కేంద్రం నిర్వహకురాలు వందన అంగీకరించింది. దీంతో మూడు రోజులుగా చోటుచేసుకుంటున్న నాటకీయ పరిణామాలకు ఎట్టకేలకు తెరపడినట్లైంది. సాంద్రానంద గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో ఈ కొనుగోలు కేంద్రంలో 21,835 బస్తాలను కొనుగోలు చేశారు. నిర్వాహకురాలు వందన అవకతవకలకు పాల్పడుతుందన్న ఆరోపణలు రావడంతో అప్రమత్తమై పరిశీలించడంతో అసలు బాగోతం బయటపడింది. 17 ట్రక్‌షీట్లను పరిశీలించగా సుమారు 230 బస్తాల ధాన్యం పక్కదోవ పట్టించినట్లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. అయితే రైతులంతా ఆందోళన వ్యక్తం చేయడంతో ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్‌రెడ్డి విచారణ చేపట్టారు. బుధవారం గ్రామంలోని పాఠశాల ఆవరణలో వందనతో చర్చించారు. ప్రారంభం నాటి నుంచి తరలించిన ధాన్యం ట్రక్‌షీట్‌లను పరిశీలించారు. మొదటి నంబరు ట్రక్‌షీట్ నుంచి అదనంగా ధాన్యం బస్తాలు నమోదు చేయడాన్ని గమనించారు. దీంతో ధాన్యం విక్రయించిన రైతులందరికీ బస్తాకు ఒక్కో కిలో చొప్పున మొత్తం 21,835 బస్తాలకు సంబంధించి 21,835 కిలోల ధాన్యం డబ్బులు రూ.5.05 లక్షలు వాపసు చెల్లించాలనడంతో ఆమె అంగీకరించింది. భరోసా నిమిత్తం మంతెన మల్లారెడ్డిని మధ్యవర్తిగా సూచించి ఒప్పం దపత్రాలు రాయించడంతో రైతులు ఆందోళన విరమించారు. ఇదిలా ఉండగా, మర్రిముస్త్యాల కేంద్రంలోని కాంటాలను పరిశీలించిన తూనికలు, కొలతలు అధికారులు అనంతరం కిష్టంపేట కేంద్రం కాంటాలనూ వెంట తీసుకుని వెళ్లారు. దీంతో అక్కడా అవకతవకలు ఆస్కారం ఉందని, అన్నీ కొనుగోలు కేంద్రాల్లోనూ విచారణ చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



కొనుగోలుకేంద్రం నిర్వహకురాలు వందనను విచారిస్తున్న ఏపీఎం శ్రీనివాస్‌రెడ్డి



పుదుచ్చేరి దంపతులకు బాలికతోపాటు దత్తతకు సంబంధించిన అధికారిక పత్రాలను అప్పగిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

బాలసదనం నుంచి పుదుచ్చేరికి..

- 13 ఏళ్ల పాపను దత్తత తీసుకున్న దంపతులు
- పిల్లలను చట్టబద్ధంగా దత్తత తీసుకోవాలి
- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, మే 28(ఆంధ్రజ్యోతి): బాలసదనంలో ఆశ్రయం పొందుతున్న ఓ బాలికను పుదుచ్చేరి దంపతులు దత్తత తీసుకున్నారు. కలెక్టర్ రాహుల్ రాజ్ ఆధ్వర్యంలో ఆ బాలికను పుదుచ్చేరి దంపతులకు అప్పగించారు. మెదక్ జిల్లా కేంద్రంలోని బాలసదనంలో ఓ 13 ఏళ్ల బాలిక ఆశ్రయం పొందుతోంది. ఆ బాలిక వివరాలను కేంద్ర దత్తత వనరుల విభాగంలో ఆన్‌లైన్ చేయగా.. పుదుచ్చేరికి చెందిన దంపతులు సెంట్రల్ ఆడాప్షన్ రిసోర్స్ అథారిటీలో దరఖాస్తు పెట్టుకున్నారు. ఆ దరఖాస్తును పరిశీలించిన కేంద్ర దత్తత వనరుల విభాగం సీనియారిటీ ప్రకారం ఆడాప్షన్‌కు అంగీకరించింది. కలెక్టర్ రాహుల్ రాజ్ ఆధ్వర్యంలో బాలికను ఆ దంపతులకు అప్పగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పిల్లలు లేని దంపతులు చట్టబద్ధంగా దత్తత తీసుకోవాలన్నారు. అనంతరం బాలలపై జరిగే అఘాయిత్యాలను అరికట్టండి అనే కరపత్రాలను కలెక్టర్, అదనపు కలెక్టర్ నగేష్, మెదక్ జిల్లా సంక్షేమాధికారి హైమావతి చేతుల మీదుగా ఆవిష్కరించారు.

జాతీయ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు మెదక్ జిల్లా క్రీడాకారులు

తూప్రాన్, మే 28(ఆంధ్రజ్యోతి): జాతీయ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా నుంచి నలుగురు ఎంపికైనట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొడిప్యాక నారాయణగుప్తా, శ్యాంసుందర్‌శర్మ బుధవారం తెలిపారు. ఈ నెల 29 నుంచి జూన్ 2 వరకు చండీగఢ్‌లో జరగనున్న 43వ జాతీయ స్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణ రాష్ట్ర బాల, బాలికల జట్టుకు మెదక్ జిల్లాకు చెందిన కార్తీక, రాంచరణ్, నందులాల్, సుమన్ ఆడనున్నారని వివరించారు. క్రీడాకారులను వారితోపాటు ఉపాధ్యాయుడు అజయ్‌కుమార్‌గౌడ్, కోశాధికారి గోవర్ధన్‌గౌడ్ అభినందించారు.



ఎంపికైన క్రీడాకారులతో శ్యాంసుందర్‌శర్మ



విజయం సాధించిన కేపీఎస్ అభ్యర్థి కొత్తగొల్ల చంద్రశేఖర్

'ఎంఆర్‌ఎఫ్' ఎన్నికల్లో కేపీఎస్ గెలుపు

సదాశివపేట, మే 28(ఆంధ్రజ్యోతి) : ఎంఆర్‌ఎఫ్ పరిశ్రమల్లో బుధవారం నిర్వహించిన కార్మిక సంఘం ఎన్నికల్లో కేపీఎస్(కార్మిక పోరాట సమితి) విజయం సాధించింది. ఆ సంఘం అభ్యర్థి కొత్తగొల్ల చంద్రశేఖర్ 139 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. మొత్తం 1,603 ఓట్లకు 1,575 పోలయ్యాయి. అందులో కేపీఎస్ అభ్యర్థి కొత్తగొల్ల చంద్రశేఖర్‌కు 584, సీఐటీయూ అభ్యర్థి చుక్క రాములుకు 445, బీఎంఎస్‌కు 382, టీడబ్ల్యూఎస్‌కు 164 ఓట్లు వచ్చాయి. కేపీఎస్ కర్మాగారం పరిసర ప్రాంతాల్లో కార్మికులు టపాసులు పేల్చి, స్వీట్లు పంచుకుని సంబురాలు జరుపుకొన్నారు.

ఆక్రమణలను పరిశీలించిన లోకాయుక్త



ఆక్రమణలను పరిశీలిస్తున్న లోకాయుక్త డైరెక్టర్ వెంకట్‌రావు

అమీన్‌పూర్, మే 28(ఆంధ్రజ్యోతి): అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని సర్వేనంబర్ 1000లోని ప్రభుత్వ భూమిని లోకాయుక్త డైరెక్టర్ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ డాక్టర్ వెంకట్‌రావు బుధవారం పరిశీలించారు. గతంలో ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలను ఆపాలని కోరుతూ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ సంస్థ లోకాయుక్తను ఆశ్రయించింది. ఈ మేరకు వాస్తవాలను పరిశీలించేందుకు క్షేత్ర స్థాయిలో దర్యాప్తును ప్రారంభించారు. అమీన్‌పూర్ తహసీల్దార్ వై.వెంకటేశ్ ప్రభుత్వ స్థలం పరిస్థితిని లోకాయుక్త పరిశీలకులకు వివరించారు. ప్రభుత్వ భూమి రక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యలు, ఏ మేరకు భూమి ఆక్రమణకు గురైంది, దాని విలువ ఎంత అనే ప్రశ్నలు వేసి డైరెక్టర్ సమాధానాలు రాబట్టారు. వాస్తవ పరిస్థితిని అంచనా వేసి లోకాయుక్తకు నివేదిక సమర్పిస్తామని పేర్కొన్నారు. విచారణకు స్థానిక మున్సిపల్ అధికారులు గైర్హాజర్ కావడం గమనార్హం. హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ సంస్థ తరఫున అడ్వకేట్ ఇంద్రజ తదితరులు హాజరయ్యారు.

ఆధునిక బోధన.. ప్రత్యక్ష శోధన

- రామచంద్రాపురంలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీపై శిక్షణ
- రూ.42 కోట్లతో భవనాన్ని సిద్ధం చేసిన టాటా
- వచ్చే నెలలో ప్రారంభించేందుకు సన్నాహాలు
- ఆరు కోర్సులు.. ఏటా 240 మందికి అవకాశం

మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా యువతరానికి సాంకేతిక పరిజ్ఞానం అందించడానికి జిల్లా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అందుకోసం రామచంద్రాపురంలో సామాజిక సేవా కార్యక్రమం కింద టాటా సంస్థ వారిచే రూ.42 కోట్లతో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ భవనాన్ని నిర్మించారు. ప్రస్తుతం ఇందులో ప్రత్యక్ష బోధనకు అవసరమైన పరికరాల అమరిక పనులు సాగుతుండగా వచ్చే నెలలో ప్రారంభానికి సిద్ధం చేస్తున్నారు. అర్హులైన యువతకు ఆరు కోర్సుల్లో ఉచిత శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు.

-రామచంద్రాపురం టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి)

పటాన్‌చెరు నియోజకవర్గంలో పరిశ్రమలు అధికంగా ఉండటంతో యువతకు సాంకేతికతలో ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలను మెరుగుపర్చాలని అధికారులు నిర్ణయించారు. ఆగస్టు నుంచి తరగతులు ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారు. దీనికోసం రామచంద్రాపురంలోని బీరంగూడ కమాన్ పక్కనే ఐటీఐ విభాగం వెనుకవైపు స్థలంలో టాటా సంస్థ వారు రూ.42 కోట్లు అంచనా వ్యయంతో 10 వేల అడుగుల్లో భవనం నిర్మించారు. ప్రత్యేక తరగతి గదుల నిర్మించి, కోర్సులకు అవసరమైన అన్ని రకాల పరికరాలు ఏర్పాటు చేస్తున్నారు. టాటా సంస్థనే ఐదేళ్ల పాటు నిర్వహణ బాధ్యతలు చేపట్టనున్నది. ఐదేళ్ల కాలంలో ప్రభుత్వ విభాగంలో పని చేస్తున్న అధ్యాపకులకు నిత్యం శిక్షణ ఇస్తారు. ప్రిన్సిపాల్ స్థాయి అధికారి పూర్తి బాధ్యతలు చేపడుతారు.

ఏటా 240 మందికి అవకాశం

ఆధునిక పద్ధతుల్లో బోధన చేసేందుకు వీలుగా ఆరు కోర్సులకుగాను ఆరుగురు అధ్యాపకులను నియమించారు. మెకానికల్ ఎలక్ట్రిక్ వెహికల్ కోర్సులో భాగంగా మార్కెట్‌లో తిరుగుతున్న ఎలక్ట్రిక్ వాహనాల మరమ్మతులు, తయారుచేసే విధానాలపై శిక్షణ ఇవ్వనున్నారు. గతంలో ఉన్న లేత్‌మిషన్ల స్థానంలో ఆధునిక పరిజ్ఞానంతో అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మెషినింగ్ అనే కోర్సును ప్రవేశపెట్టారు. అలాగే పరిశ్రమల్లో రోబోటిక్ వ్యవస్థపై పని చేసేందుకు వీలుగా ఇండస్ట్రియల్ మ్యాన్‌ఫాక్చరింగ్ అండ్ రోబోటిక్స్ కోర్సును అందుబాటులోకి తెచ్చారు. ఇక ఆర్టిసియన్ యూజ్డ్ అడ్వాన్స్‌డ్ టూల్ కోర్సులో భాగంగా భవన నిర్మాణాల డిజైన్లను పూర్తిగా యంత్రాలపై చేసే విధానాలపై శిక్షణ ఇస్తారు. ఇదివరకు వెల్డింగ్ చేయాలంటే ముఖానికి అద్దం పెట్టుకోవాల్సి వచ్చేది. ఇప్పుడు దాన్ని సైతం స్క్రీన్‌పై చూస్తూ వెల్డింగ్ చేసే విధానాలపై పాఠ్యాంశంగా మార్చారు. దీనికి బేసిక్ డిజైన్ అండ్ వర్చ్యువల్ వెరిఫైర్ (మెకానికల్) కోర్సుగా నామకరణం చేశారు. ఇక చివరిది హార్డ్‌వేర్ రంగంలో ఉండే వివిధ రకాల ఎలక్ట్రానిక్ పరికరాల మరమ్మతులు, ఉత్పత్తులు చేసే విధానాలపై శిక్షణ ఇవ్వనున్నారు. ఇలా ఆరు రకాల కోర్సుల్లో ఏటా 240 మందికి అవకాశం కల్పిస్తారు. మూడు కోర్సుల శిక్షణ కాలం ఏడాది కాగా, మరో మూడు కోర్సుల శిక్షణ రెండేళ్లపాటు నిర్వహించనున్నారు. ఆగస్టు నెల నుంచి తరగతులు నిర్వహించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. విద్యార్థులు కోర్సుల్లో చేరేందుకు ఉన్నత స్థాయి అధికారులు త్వరలో నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు.



నూతనంగా నిర్మించిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ భవనం



రోబోలతో వాహనాల తయారీ..

ఏర్పాట్లు పూర్తి చేశాం..



ఆధునిక పద్ధతుల్లో బోధన చేసేందుకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తిచేశాం. విద్యార్థుల ప్రవేశానికి ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు నోటిఫికేషన్ జారీ చేస్తాం. పది ఉత్తీర్ణులయిన వారికి అవకాశం ఉంటుంది. ఇక్కడ శిక్షణ పూర్తి చేసుకున్నవారికి వంద శాతం ఉద్యోగ అవకాశాలు ఉంటాయి.

-శ్రీనివాస్‌రావు, ప్రిన్సిపాల్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్



సాంస్కృతిక కార్యక్రమం దృశ్యం

సామూహిక స్ఫూర్తిని నింపిన 'ముదిత 3.0'

పటాన్‌చెరు రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి) : గీతం వార్షిక ఆనందం, శ్రేయస్సుల వేడుక 'ముదిత 3.0' సామూహిక స్ఫూర్తిని చాటింది. హైదరాబాద్‌లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయ ఆతిథ్య విభాగం బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు, సహాయ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేశారు. అత్యుత్తంగా సేవలందించిన సిబ్బందికి అవార్డులను ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో హైదరాబాద్ అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఆతిథ్య విభాగం, క్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ పిత్తాశయం నుంచి 55 రాళ్లు తొలగింపు

మెదక్ కల్చరల్, మే 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని శ్రీ సాయి చంద్ర నర్సింగ్ హోమ్ డాక్టర్ పి.సురేష్, జనరల్ సర్జన్ ఆధ్వర్యంలో ఈ అరుదైన చికిత్స చేశారు. మెదక్ మండలంలోని మల్కాపూర్‌కు చెందిన తాలి(65) ఏడాదిగా తీవ్ర కడుపునొప్పితో బాధపడుతున్నది. దీంతో డాక్టర్ సురేష్‌ను ఆశ్రయించగా పిత్తాశయంలో రాళ్లు ఉన్నట్లు గుర్తించారు. దాదాపు గంటన్నర పాటు శ్రమించి ఆపరేషన్ ద్వారా 55 రాళ్లను బయటకు తీశారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉంది.

'ఫుల్ టైం' పని ఎప్పుడో?



ప్రభుత్వ పాఠశాలలో గంట కొడుతున్న పార్ట్ టైం స్వీపర్ యాదగిరి, కొండంరాజుపల్లిలో పాఠశాలను శుభ్రం చేస్తున్న పార్ట్ టైం స్వీపర్ రాములు

నంగునూరు, మే 28 (ఆంధ్రజ్యోతి) : ప్రతిరోజు ఉదయం ఏడు గంటలకే బడి తాళం తీసి ఆవరణ గదులు, మరుగుదొడ్లు శుభ్రం చేయడం, మంచినీళ్ల ఏర్పాటు చేసి మళ్లీ సాయంత్రం బడి మూసే వరకు విధులు నిర్వహిస్తున్న పార్ట్ టైం స్వీపర్ల బతుకు అగమ్య గోచరంగా మారింది. ప్రభుత్వ పాఠశాలల్లో 35 సంవత్సరాలుగా పనిచేస్తున్న పార్ట్ టైం స్వీపర్లను ఎవరు పట్టించుకున్న పాపాన పోలేదు. నేతలు ఎందరో మారారు, రాష్ట్రాలే మారిపోయాయి అయినా వారి బతుకులు మారడం లేదు. పేరుకు మాత్రమే పార్ట్ టైం, కానీ చేసేదంతా ఫుల్ టైమ్ పనులే అన్న విషయం ఎవరు గుర్తించలేకపోతున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రాజకీయ నేతలు వెట్టి చాకిరి నుంచి విముక్తి చేసి పార్ట్ టైం స్వీపర్లను రెగ్యులర్ చేసి వారి జీతాలు పెంచి జీవితాలను గొప్పగా మార్చుతామని ఉపన్యాసాలు ఇచ్చారు. ఎక్కడ కూడా అమలు చేయలేక పోయారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే కాంట్రాక్ట్, పార్ట్ టైం, అవుట్సోర్సింగ్ అనేది ఉండదని అందర్నీ రెగ్యులర్ చేస్తామని నమ్మక పలికించారు. దాంతో తెలంగాణ ఏర్పడితే తమ బతుకులు బాగుపడతాయని పార్ట్ టైం స్వీపర్లు, కాంట్రాక్ట్ , ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు చాలామంది ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. సకలజనుల సమ్మెలో సైతం చిరుద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అయినా పార్ట్ టైమ్ ఉద్యోగుల బతుకులు మారలేదు. నేతలు మారారు, రాష్ట్రాలు సైతం మారాయి కానీ అదే పని అదే విధానం తో పార్ట్ టైం స్వీపర్లు పని చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 35 సంవత్సరాల క్రితం రూ.75 జీతంతో ఉద్యోగంలో చేరారు. ఏళ్ల గడుస్తున్నా రెగ్యులర్ చేయకుండా వెట్టిచాకిరి చేయిస్తూ కాలం వెల్లదీస్తున్నారు. ప్రస్తుతం పార్ట్ టైం స్వీపర్లకు రూ.5200 వేలు మాత్రమే ఇస్తున్నారు. గత ప్రభుత్వం వీఆర్ఏలను ఇతర శాఖలోకి మారుస్తుండగా తమను కూడా మారుస్తారని గంపెడాశతో ఎదురు చూశారు. కానీ వారి ఆశలు అడియాశలుగానే మిగిలిపోయాయి. చాలీచాలని వేతనాలతో నెట్టుకొస్తున్న తమను రిటైర్మెంట్ అయ్యే వరకైనా రెగ్యులర్ చేస్తారని ఆశతో ఎదురు చూస్తున్నారు.

ఆసరా అందాలంటే ఆటోలో వెళ్లాల్సిందే..


సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద పెన్షన్ డబ్బుల కోసం స్లిప్పులు రాయించుకుంటున్న వృద్ధులు

రాయపోల్, మే 28 (ఆంధ్రజ్యోతి): వృద్ధులు డబ్బుల కోసం కుటుంబ సభ్యులపై ఆధారపడకుండా ఉండడానికి ప్రభుత్వం ఆసరా పెన్షన్లు అందజేస్తుంది. ఆయా గ్రామాల్లో బ్యాంక్ అధికారులు ఆధార్ ఎనేబుల్ పేమెంట్ సిస్టం (ఏఏపీస్) మిషన్ల ద్వారా బ్యాంకు మిత్రులతో పెన్షన్ డబ్బులను అందజేస్తున్నారు. కానీ రాయపోల్ మండలం రామారం గ్రామంలో బ్యాంకు మిత్రులను ఏర్పాటు చేయకపోవడంతో ఆ గ్రామానికి చెందిన ఆసరా పెన్షన్ల లబ్ధిదారులకు డబ్బులు డ్రా చేసుకోవడానికి ఇబ్బంది ఏర్పడింది. దీంతో వృద్ధులు ప్రతి నెల ఆటో కిరాయికి తీసుకొని రాయపోల్ సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు వెళ్లి డబ్బులు డ్రా చేసుకుంటున్నారు. కొందరు వృద్ధులు తోడుగా మరొకరు రానిదే బయటకు వెళ్లలేని పరిస్థితిలో ఉన్నారు. దీంతో వృద్ధుల డబ్బులు వృధా కావడమే కాకుండా నానా ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం రాయపోల్ సీబీఐ వద్దకు ఆటోలో వచ్చిన రామారం వృద్ధులు విత్ డ్రా స్లిప్పులు రాయించుకుంటూ ఆంధ్రజ్యోతికి కనిపించారు. రామారం గ్రామంలో కూడా బ్యాంకు మిత్రులను నియమించి గ్రామంలోనే పెన్షన్ డబ్బులు అందేలా చూడాలని వృద్ధులు కోరుతున్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి..

సిద్దిపేట అర్బన్, మే 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లేలా కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. బుధవారం సిద్దిపేట అర్బన్ మండలం నారాయణరావుపేట మండలానికి చెందిన ఇతర పార్టీల కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరిన సందర్భంగా ఆయన కండువా కప్పి వారిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాసంక్షేమం కోసం కృషి చేస్తున్నారని పేద ప్రజల అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతున్నారని అన్నారు. ప్రభుత్వ ప్రజా సంక్షేమ పథకాలు నచ్చడంతో ప్రభుత్వ పనితీరు నచ్చడంతో ఇతర పార్టీ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరడానికి ఆసక్తి చూపిస్తున్నారని అన్నారు.

డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పూర్తి చేయాలి

హుస్నాబాద్, మే 28 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ పట్టణంలో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని బీజేపీ పట్టణ అధ్యక్షులు బత్తుల శంకర్ బాబు డిమాండ్ చేశారు. బుధవారం హుస్నాబాద్‌లో ఆర్అండ్‌బీ డీఈ నరేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను 96 మందికి పట్టాలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. వెంటనే మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయాలని కోరారు.

సీసీరోడ్లు, డ్రైన్ కాలువల నిర్మాణం చేపట్టాలి


మేనేజర్ ప్రభాకర్‌కు వినతిపత్రం అందిస్తున్న అయ్యప్పకాలనీ వాసులు

చేర్యాల, మే 28 (ఆంధ్రజ్యోతి): చేర్యాల పట్టణశివారు అయప్పకాలనీలో అంతర్గత సీసీరోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణం చేపట్టాలని కోరుతూ కాలనీ వాసులు బుధవారం మున్సిపల్ కార్యాలయాధికారులకు వినతిపత్రం అందించారు. జాతీయ ప్రధానరహదారి నుంచి గుంటూరుపల్లి కాలనీకి వెళ్లే ప్రధాన దారి గుంతలమయంగా మారిందని, జనావాసాలలో సీసీ రోడ్లు, మురుగు నీటి కాలువల నిర్మాణం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈవిషయమై ప్రాధాన్యతగా నిర్మాణాలు పూర్తిచేయాలని విన్నవించారు.

ఇష్టారాజ్యంగా డ్రైనేజీ పనులు

హుస్నాబాద్, మే 26 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మున్సిపల్‌లోని 14వ వార్డులో అధికారుల పర్యవేక్షణ లేక పోవడంతో సదరు కాంట్రాక్టర్ తన ఇష్టారాజ్యంగా డ్రైనేజీ పనులు నిర్వహిస్తున్నాడని దీని వల్ల వార్డులో డ్రైనేజీ సమస్య అస్తవ్యస్థంగా తయారైందని హుస్నాబాద్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అక్కు శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని 14వ వార్డులో పర్యవేక్షణ చేసి డ్రైనేజీ పనులపై ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడారు. సమస్య ఉన్న చోట పనిచేయాల్సిన కాంట్రాక్టర్ తన ఇష్టం వచ్చిన చోట పనులు చేస్తూ ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నట్లు ఆరోపించారు. ఇంజనీరింగ్ అధికారులు వార్డుల్లో జరిగే పనులు పర్యవేక్షణ చేసి నాణ్యతతో కూడిన పనులు చేయించాలని డిమాండ్ చేశారు.

భూ నిర్వాసితుల కాలనీ అద్భుతం

ములుగు, మే 28 (ఆంధ్రజ్యోతి): కొండపోచమ్మ సాగర్ భూ నిర్వాసితుల కోసం నిర్మించిన గృహాలు అద్భుతంగా ఉన్నాయని కోల్ ఇండియా బృందం అన్నారు. బుధవారం కొండపోచమ్మసాగర్ ఆర్అండ్ఆర్ కాలనీలోని వసతుల గురించి స్థానికులని అడిగి తెలుసుకున్నారు. కోల్ ఇండియా ఉద్యోగులు నిర్వాసితులకు ప్రభుత్వం కల్పించిన వసతుల కోసం అధ్యయన పరంగా కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారులు రిజర్వాయర్ నిర్మాణం, అమలు చేసిన సాంకేతికతలు ప్రాజెక్టు వల్ల సాగునీటి రంగానికి కలిగే ప్రయోజనాల గురించి అవగాహన కలిగించారు. ప్రాంత అధికారుల సమన్వయంతో సందర్శనలో పాల్గొన్న బృందానికి భూసేకరణ ప్రక్రియ, నిర్మాణపు కీలక దశలు మరియు ప్రాజెక్టు ద్వారా కలుగుతున్న ప్రాదేశిక అభివృద్ధిపై సమగ్రంగా బృందానికి ములుగు రెవెన్యూ డిప్యూటీ తహసీల్దార్ భవాని తెలిపారు.

రెడ్ల సమగ్ర కుటుంబ సర్వే యాప్ ఆవిష్కరణ

దౌల్తాబాద్,మే 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్‌వీ ఫంక్షన్ హాల్లో బుధవారం జిల్లా రెడ్డి సంఘం నాయకులు దేవుడి నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో రెడ్ల సమగ్ర కుటుంబ సర్వే యాప్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ రెడ్ల కుటుంబ సర్వే యాప్‌కు ముఖ్య అతిథిగా పొందర్ ఉపేందర్‌రెడ్డి,ప్రొఫెసర్ కరుణాకర్‌రెడ్డిలు హాజరై రెడ్ల సమగ్ర కుటుంబ సర్వే యాప్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు వంటేరు గోపాల్‌రెడ్డి,వివిధ మండలల రెడ్డి సంఘం నాయకులు హాజర్యరు.

న్యూస్ బాక్స్

డ్రంకెన్ డ్రైవ్‌లో 9 మందికి జరిమానా

సిద్దిపేట క్రైం, మే 28 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ తన సిబ్బందితో కొన్ని రోజుల నుంచి సిద్దిపేట పట్టణంలో నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీవో ఆఫీస్ చౌరస్తాలలో రాజీవ్ రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో 9 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా పట్టుకున్నారు. వారిని బుధవారం సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు, న్యాయమూర్తి ముందు హాజరుపరచగా విచారణ చేసి 9 మందికి రూ.13,500 జరిమానా విధించారు.

తిరుపతిలో పొట్లపల్లి భజన మండలి భక్తులు

హుస్నాబాద్‌రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): తిరుమల-తిరుపతిలో రెండు రోజుల క్రితం నిర్వహించిన అఖండ హరి నామ సంకీర్తనలో హుస్నాబాద్ మండలం పొట్లపల్లి గ్రామానికి చెందిన శ్రీ శివరామ కృష్ణభజన మండలి భక్తులు పాల్గొని తమ భక్తికీర్తనలు వినిపించారు. ఈ కార్యక్రమంలోశివరామ కృష్ణ భజనమండలి సభ్యులు దేవరాజు, మల్లయ్య, చారి, జగదీశ్వరచారి, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యానికి ఎనలేని కృషి


ప్రతాపరెడ్డి చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

సిద్దిపేట కల్చరల్, మే 28 (ఆంధ్రజ్యోతి) : 354 కవులతో కూడిన 'గోల్కొండ కవుల' గ్రంథాన్ని కవుల జీవిత విశేషాలతో సహా ప్రచురించి గ్రంథరూపంలోనే సమాధానమిచ్చిన వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి అని జాతీయ సాహిత్య పరిషత్ సిద్దిపేట అధ్యక్షులు ఎన్నవెల్లి రాజమౌళి, బాలసాహితీవేత్త ఉండ్రాళ్ళ రాజేశం, యువకవి బస్వ రాజ్ కుమార్ అన్నారు. సురవరం ప్రతాపరెడ్డి జయంతి సందర్భంగా సిద్దిపేటలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ పత్రిక సంపాదకులుగా, కవి, రచయిత, సామాజిక చైతన్యకారులుగా ఎనలేని సేవ చేసిన సురవరం ప్రతాపరెడ్డి బాటలో సాగాలన్నారు. తెలుగు విశ్వవిద్యాలయానికి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టడం సంతోషమన్నారు. పాత తరం, కొత్త తరం రచయితలు సురవరంను స్ఫూర్తిగా తీసుకొని సాహిత్య కృషి చేయాలన్నారు.

ఆర్గానిక్ వ్యవసాయ పద్ధతులు పాటించాలి

● లోడీ సాంఘిక సేవా సంస్థ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బాలశౌరి

అక్కన్నపేట, మే 28 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆర్గానిక్ వ్యవసాయ పద్ధతులు పాటించాలని లోడీ సాంఘిక సేవా సంస్థ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎం బాలశౌరి అన్నారు. గురువారం అక్కన్నపేట మండలంలోని పలు గిరిజన తండాల్లో ఆర్గానిక్ వ్యవసాయ పద్ధతులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పొలాల్లో వర్మి కంపోస్టు, పశువుల పెంట, గొర్రెలు మేకల ఎరువు, నల్లరేగడి మట్టి పోసుకుంటే పంట అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు. పంట సాగులో రసాయన ఎరువులు తగ్గించాలని సూచించారు. అనంతరం 23 తండాల్లో గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. ఇందులో ప్రాజెక్ట్ మండల కోఆర్డినేటర్, ముడవత్ తిరుమల, పిల్లి రమేష్, తదితరులు పాల్గొన్నారు.



కేశానాయక్‌తండాలో రైతులకు అవగాహన కల్పిస్తున్న బాలశౌరి

'డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టాలి'


డ్రగ్స్‌కు వ్యతిరేకంగా జరిపిన ర్యాలీలో పాల్గొన్న మహిళలు

అక్కన్నపేట, మే 28 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టేందుకు మహిళలు ఉద్యమించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి పిలుపునిచ్చారు. బుధవారం అక్కన్నపేట మండల కేంద్రంలో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా జేఏసీ ఆధ్వర్యంలో మహిళలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో డ్రగ్స్ మహమ్మారిని నిర్మూలించడానికి తొలి ప్రయత్నంగా హుస్నాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్న జేఏసీ బృందాన్ని అభినందించారు. సమాజంలో ఒక చీడపురుగు లాగా డ్రగ్స్ మహమ్మారి వచ్చి చొరబడిందని, మహిళలు మేలుకొని ఈ డ్రగ్స్ అనే మహమ్మారిని రాష్ట్రం నుంచి తరిమేసే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. మాదకద్రవ్యాల వాడకం వల్ల పచ్చని కుటుంబాలు పాడవుతున్నాయని, గ్రామాల్లో డ్రగ్స్ పర్యావసనాలపై ప్రజలకు అవగాహన కలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, జేఏసీ నియోజకవర్గ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి, ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్, తదితరులున్నారు.

'చిరస్మరణీయుడు ఎన్టీఆర్'


గజ్వేల్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అభిమానులు

హుస్నాబాద్/గజ్వేల్, మే 28 (ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజల గుండెల్లో ఎన్టీఆర్ ఎప్పటికీ చిరస్మరణీయుడని గజ్వేల్ ఎన్టీఆర్ అభిమానులు ఉద్ఘాటించారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా గజ్వేల్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో గల ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. హుస్నాబాద్ పట్టణంలోని అక్కన్నపేట చౌరస్తాలో బుధవారం స్వర్గీయ ఎన్టీఆర్ జయంతి వేడుకలను టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఇందులో టీడీపీ నాయకులు బత్తుల శంకర్, ఆకుల వెంకటేష్, ఆంజనేయశర్మ, మల్లగౌడ్, రవీందర్, నర్సిరెడ్డి తదితరులు ఉన్నారు.

31న వరంగల్‌కు తరలి రావాలి

ములుగు, మే 28 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 31న వరంగల్‌కు మంద కృష్ణ మాదిగ వస్తున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బుడిగె మహేష్ కోరారు. బుధవారం ములుగు మండలం వంటిమామిడిలో విలేకరులతో మాట్లాడుతూ మంద కృష్ణ భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డు అందుకున్నారు. 31న ఉదయం 10 గంటలకు వరంగల్‌కు రానున్నారు. పద్మశ్రీ గ్రహీత మంద కృష్ణ మాదిగ స్వాగతం పలకడానికి ప్రతి ఒక్కరు తరలిరావాలని కోరారు.

అథ్లెటిక్స్‌తో ఉజ్వల భవిష్యత్తు

● డీవైఎస్ఓ వెంకట నరసయ్య

సిద్దిపేట కల్చరల్, మే 28 (ఆంధ్రజ్యోతి) : అథ్లెటిక్స్‌తో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని డీవైఎస్ఓ వెంకట నరసయ్య అన్నారు. సిద్దిపేట జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో స్థానిక స్టేడియంలో అండర్ 8, అండర్ 10, అండర్ 12 బాల బాలికల కిడ్స్ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు వచ్చే నెల ఒకటిన సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్ లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు 17 మందిని ఎంపిక చేశారు.

ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

కుకునూరుపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవాలయ పునః ప్రారంభ విగ్రహ పునః ప్రతిష్ట వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం ఉత్సవ విగ్రహాలను గ్రామ వీధుల గుండా ఊరేగించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దేశభక్తి ఉన్న వ్యక్తి వీరసావర్కర్

సిద్దిపేట క్రైం, మే 28 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర వీరసావర్కర్‌ను బ్రిటీష్ వారు హింసించగలిగారు గాని తనలో దేశభక్తిని ఏమాత్రం తగ్గించలేకపోయారని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బాసంగారి వెంకట్ అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో వీర సావర్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి బీజేపీ నాయకులతో కలిసి పూలమాలవేసి నివాళులర్పించారు.

ఉత్తమ సేవలకు సత్కారం


రివార్డ్స్ అందుకున్న పోలీసు అధికారులు, సిబ్బందితో సీపీ డాక్టర్ బి.అనురాధ

మర్కుక్ /సిద్దిపేట క్రైం, మే 28 (ఆంధ్రజ్యోతి): జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలలో విధి నిర్వహణలో ప్రతిభ కనపరిచిన పోలీస్ అధికారులకు, సిబ్బందికి సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ బుధవారం కమిషనర్ కార్యాలయంలో ప్రోత్సహకాలు అందజేశారు. గౌరారం పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న బ్లూ కోల్ట్స్ కానిస్టేబుళ్లు రామకృష్ణ, గౌతమ్, ఇద్దరూ సమయస్ఫూర్తితో వ్యవహరించి ఇద్దరు వ్యక్తులను పట్టుకొని తుపాకీ, రౌండ్స్ రికవరీ కేసులో సిపి ప్రత్యేకంగా అభినందించి అప్రిసియేషన్ సర్టిఫికెట్, నగదు రివార్డు అందజేశారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఫంక్షనల్ వర్టికల్ వారీగా విధినిర్వహణలో ప్రతిభ కనపరిచిన పోలీస్ అధికారులు సిబ్బందిని అభినందించారు. ప్రతిభ కనబరిచే సిబ్బందిని అధికారులను గుర్తించి ప్రతి నెల అధికారులను సిబ్బందిని ప్రోత్సహించే విధంగా రివార్డులు, అవార్డులు, ఇవ్వడం జరుగుతుందన్నారు.

మర్కుక్‌లో

మర్కుక్ మండలంలో క్రైమ్ రేట్ తగ్గించినందుకు గంజాయి మత్తు మారక ద్రవ్యాలను నిర్మూలించడంలో సఫలమైన మర్కుక్ మండల ఎస్సై దామోదర్‌కు బుధవారం సిద్దిపేట జిల్లా కమిషనరేట్‌లో కమిషనర్ అనురాధ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

జీలుగ విత్తనాలను సరఫరా చేయాలి

మిరుదొడ్డి, మే28 (ఆంధ్రజ్యోతి): రైతులకు సరిపడా జీలుగ విత్తనాలను సరఫరా చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు నర్సింహారెడ్డి, ఐలయ్య అన్నారు. బుధవారం మిరుదొడ్డిలో రైతులతో కలిసి మాట్లాడారు. రైతులకు జీలుగ విత్తనాలు అందుబాటులో లేకపోవడం ద్వారా అనేక ఇబ్బందులు కలుగుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం స్పందించి జీలుగవిత్తనాలను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులతో కలిసి పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడుతామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో రైతులు మహేందర్‌రెడ్డి, రమేష్ తదితరులున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

దౌల్తాబాద్/దుబ్బాక/ మిరుదొడ్డి,మే28(ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు గొప్పవరమని బీజేపీ దుబ్బాక మున్సిపాలిటీ అధ్యక్షుడు శ్రీకాంత్, మిరుదొడ్డి మండల అధ్యక్షుడు అమర్‌లు అన్నారు. బుధవారం దుబ్బాకలోని 14,15వవార్డుల్లోని ఎంపీ రఘునందన్‌రావు ఆదేశాల మేరకు మాధురి, నస్రీన్‌బేగం, భవ్యలకు 51వేల రూపాయాల చెక్కులను అందజేశారు. అలాగే మిరుదొడ్డి మండలంలోని కాసులాబాద్ గ్రామంలోని ముత్యాల బాబు, రాజు 60 వేల రూపాయాల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. దౌల్తాబాద్ మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన జనగామ భూదయ్యకు రూ. 1లక్ష 75 వేలు సీఎం ఆర్ఎఫ్ చెక్కును బుధవారం గ్రామ మాజీ ఎంపీటీసీ బండారు దేవేందర్, మాజీ సర్పంచ్ సర్వగారి యదవరెడ్డి బాధితుడికి అందజేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

మిరుదొడి/గజ్వేల్/దౌల్తాబాద్/ దుబ్బాక, మే28(ఆంధ్రజ్యోతి): శిక్షాతులైన ఉపాధ్యాయులతో విద్యాబోధనను సాగించే ఏకైక విద్యాసంస్థలు ప్రభుత్వ పాఠశాలలనీ, అందులోనే నాణ్యమైన విద్య అందుతుందనీ టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు షేక్‌వలీ అహ్మద్ అన్నారు. బుధవారం దుబ్బాకలో టీఎస్‌యూటీఎఫ్ ప్రచారజాతలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్టేటస్‌కు వెళ్లి అధిక ఫీజులు చెల్లించి, ప్రైవేటు పాఠశాలల్లో పిల్లలను చదివిస్తున్నారనీ, దీనివల్ల తల్లిపుస్తెలు అమ్మి ఫీజులు చెల్లించే పరిస్థితి దాపురించిందన్నారు.

మహిళల ఆరోగ్య రక్షణపై అవగాహన

హుస్నాబాద్‌రూరల్/అక్కన్నపేట/మద్దూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లో బుధవారం జరిగిన అంతర్జాతీయ రుతు పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా మద్దూరు పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి, మహిళలను ఉద్దేశించి మాట్లాడారు. మహిళలందరూ తప్పకుండా రుతు స్రావ కప్‌లను, క్లాతులను వినియోగించాలని దేవకీదేవి సూచించారు. మహిళల ఆరోగ్యరక్షణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మద్దూరు పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు తెలిపారు.

పేకాట ఆడుతున్న పలువురి అరెస్ట్

చేర్యాల, మే 28 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల పట్టణంలోని వాసవీగార్డెన్స్ సమీపంలోని ఓ నివాసంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం రాత్రి దాడులు చేపట్టి పలువురిని పట్టుకున్నారు. పట్టణంతో పాటు కడవేరుగు గ్రామాలకు చెందిన వారున్నారని, నిందితులనుండి రూ.8,380నగదు, 4 సెల్‌ఫోన్లు, 52పేక ముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

చేర్యాల మాజీ వార్డు సభ్యుడు మృతి

చేర్యాల, మే 28 (ఆంధ్రజ్యోతి): చేర్యాల పూర్వపు గ్రామపంచాయతీ మాజీ వార్డుసభ్యుడు బోడ్డు వీరేశం(56) బుధవారం హఠాన్మరణం చెందారు. గుండెనొప్పి రావడంతో అస్వస్థతకు గురైన వీరేశంను సిద్దిపేటకు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు.

రైతులకు గొప్ప అవకాశం



రైతులు ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటలు సాగు, పశువుల షెడ్లను నిర్మించుకోవచ్చు. ఆసక్తిగల రైతులు పంచాయతీల్లో పేరు నమోదు చేసుకోవాలి. ఉపాధి హామీ పథకంలో కల్పిస్తున్న ఈ సదుపాయం జాబ్ కార్డు ఉన్న రైతులకు గొప్ప అవకాశం. మండలంలోని అర్హులందరూ వినియోగించుకోవాలి

- రాజు ఏపీవో దౌల్తాబాద్ మండలం

పండ్ల తోటలకు ఉపాధిహామీ!

(5వ పేజీ తరువాయి..)

పండ్ల మొక్కలు నాటేందుకు అవకాశం కల్పించింది. అలాగే మునగ, జామాయిల్, ఆయిల్ పామ్ మొక్కలను కూడా పెంచుకోవచ్చు. మొక్కలు నాటేందుకు గుంతలు తీయడం, కూలీల ఖర్చు, మూడేళ్ల వరకు ఉపాధిహామీ ద్వారా నిర్వహణ ఖర్చులను ప్రభుత్వం అందించనుంది. వ్యక్తిగత పనులు, కంపోస్టు, పశువులకు షెడ్లు, నీటితొట్ల నిర్మాణం, ఇతర పనులు ఉపాధి హామీలో వందశాతం సబ్సిడీతో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించినట్లు అధికారులు స్పష్టం చేస్తున్నారు. దౌల్తాబాద్ మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో 15 ఎకరాల్లో పండ్ల తోటలు, 100 ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలు సాగు చుస్తున్నారు. రైతుల్లో క్రమంగా అవగాహన పెరుగుతుండడంతో ఇప్పుడిప్పుడే సాగుకు ముందుకొస్తున్నారు.


మండల కేంద్రంలో నిమ్మ తోట సాగు